

ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలి

వికారాబాద్, జూన్ 14 : వికాకారాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ప్రమోషన్ కోసం ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని డీఈవో రేణుకాదేవి తెలిపారు. డీఎస్సీ-2003 వరకు నియామకమైన బీఎడ్, టీటీసీ అర్హతగల ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్వీస్ రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్స్, ర్యాంకు కార్డు, అపాయింట్‌మెంట్ ఆర్డర్‌కాపీతో పాటు, ఒక సెట్ జిరాక్స్ కాపీ, సంబంధిత ఫార్మాట్ తీసుకుని రావాలని సూచించారు.

ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జూన్ 14(ఆంధ్రజ్యోతి): ధరణి, ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ధరణి మాడ్యూల్స్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులపై సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు, డబుల్ డిజిటల్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను కూడా పూర్తి చేయాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



» వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్14 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు పెండింగ్ లేకుండా రెండు రోజుల్లో పూర్తి చేయాలని, ప్రతి స్కూల్‌లో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ జరగాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ముఖ్యంగా మిషన్ భగీరథ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. మండలం వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. బడి బాట కార్యక్రమం కింద ముఖ్యంగా బడి ఈడు పిల్లలు బడిబాట పట్టేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిదంగా పాఠశాలల ప్రారంభం రోజున టెక్స్‌బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్ ప్రతిస్కూల్‌లో పంపిణీ చేసి కార్యక్రమాన్ని విజయవంతగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీఈవో రేణుకాదేవి, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.


నామినేటెడ్ పోస్టులపై నజర్!

» అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో జోరుగా పైరవీలు
» పార్టీ పెద్దలను కలుస్తున్న ఆశావహులు
» ఇప్పటికే తొలి విడతలో ముగ్గురికి దక్కిన పోస్టులు
» అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ త్యాగం చేసినవారికి ప్రాధాన్యం!

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పడంతో ఆశావహులంతా వాటిని సాధించే పనిలో పడ్డారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు, గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు త్యాగం చేసిన వారు తమకు తప్పకుండా పదవి దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. మరి కొందరు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీలో కీలక నేతలతో సన్నిహితంగా ఉన్న నాయకుల ద్వారా పదవులు పొందేలా చూసుకుంటున్నారు. ఇంకొందరు గతంలో తమకు నామినేటెడ్ పోస్టులు ఇస్తామని హామీ ఇచ్చారని, కాబట్టి తమకు తప్పకుండా పదవి దక్కుతుందన్న ధీమాతో ఉన్నారు. చివరకు ఈ పదవులు ఎవరికి దక్కుతాయో చూడాల్సిందే.



అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన వారికి ఇప్పటికే చైర్మన్ పోస్టులను కట్టబెట్టాలని యోచిస్తుండంతో సీఎం రేవంత్‌కు, అధిష్ఠానం పెద్దలకు సన్నిహితంగా ఉన్నవారితో కొందరు పైరవీలు ప్రారంభించారు.



ఆశావహుల్లో రేకెత్తిస్తున్న ఆశలు

రంగారెడ్డి జిల్లాలో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి నామినేటెడ్ రేస్‌లో ఉన్నారు. జిల్లా నుంచి కొందరికి ఇప్పటికే అవకాశాలు దక్కాయి. ఇప్పటికే రాజేంద్రనగర్ అసెంబ్లీ స్థానం నుంచి ఓ నేతకు నామినేటెడ్ పదవి దక్కగా మరో ఇద్దరు సీనియర్ నేతలు సామెం శ్రీనివాస్‌గౌడ్, సామ రాజ్‌పాల్‌రెడ్డి నామినేటెడ్ పదవిని ఆశిస్తున్నారు. చేవెళ్ల అసెంబ్లీ స్థానం నుంచి ఈసారి ఎమ్మెల్యే టికెట్ ఆశించిన భంగపడిన నేతలు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్‌కు పార్టీ అధిష్ఠానం సరైన న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో వారిద్దరూ నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్నారు. అలాగే షాబాద్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి సీఎంకు సన్నిహితుడు కావడంతో ఆయన తనకు తప్పకుండా పదవి వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ధరణి కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డికి త్వరలో ఏర్పాటు కానున్న వ్యవసాయ కమిషన్‌లో కీలక పదవి వరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి పార్టీ సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, కొత్తకుర్మ శివకుమార్, కొంగరి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఓసారి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పనిచేసిన కప్పాటి పాండురంగారెడ్డి మరోసారి చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. అలాగే కల్వకుర్తి నియోజకవర్గంలో ఆమనగల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్, మైసిగండి మాజీ ఎంపీటీసీ అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు సూదిని రామిరెడ్డి, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, వై.నర్సింహ, వి.జంగయ్య నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్నారు. అలాగే మేడ్చల్ జిల్లాలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు సీనియర్ నేతలు హరివర్ధన్‌రెడ్డి, నక్కా ప్రభాకర్‌గౌడ్, నర్సిరెడ్డి భూపతిరెడ్డి రేస్‌లో ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేలతో పాటు రేస్‌లో పలువురు

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/మేడ్చల్, జూన్ 14 : గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశాలు దక్కని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలంతా ఇపుడు నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఆశలు పెట్టుకున్నారు. త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆ పోస్టుల కోసం క్యూ కడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో పదవుల కోసం వీరంతా తమ వంతు ప్రయత్నాలు మొదలు పెట్టారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ సర్కారు రావడంతో ప్రాధాన్యం కలిగిన పోస్టులు దక్కించుకోవాలని కొందరు నేతలు ఆరాటపడుతున్నారు. ఏళ్ల తరబడి పార్టీ బలోపేతం కోసం కష్టపడుతూ, పార్టీ కోసం టికెట్లను సైతం త్యాగం చేసిన కీలక నేతలు ప్రభుత్వంలోని వివిధ నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు. వీటిని దక్కించుకునేందుకు సన్నిహిత మంత్రులు, ఏఐసీసీ, టీపీసీసీ పెద్దలతో పైరవీలు షురూ చేశారు. ఇప్పటికే జిల్లాకు మూడు పదవులు దక్కాయి. తాజాగా మరికొన్ని కార్పొరేషన్లకు, కమిషన్లకు చైర్మన్లను నియమించే అవకాశం ఉండటంతో సామాజిక సమీకరణాలు, స్థానిక అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ పదవులను కట్టబెట్టే అవకాశం ఉండటంతో ఎవరికి వారు వ్యక్తిగత పైరవీలు మొదలు పెట్టారు. నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్న వారిలో మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు అనేక మంది ఉన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు కీలక కమిషన్లు, కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఆశావహులంతా సీఎంతో పాటు మంత్రులు పార్టీ పెద్దలను కలిసి విన్నపాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. వాటిలో ఇప్పటికే రంగారెడ్డి జిల్లాకు మూడు పదవులు దక్కాయి. వీటిలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోస్టును మల్‌రెడ్డి రాంరెడ్డికి కేటాయించగా, పట్టణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని, జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, గత అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే సీటును త్యాగం చేసిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవిని కట్టబెట్టింది. అంతలోనే ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో వారెవరూ బాధ్యతలు స్వీకరించలేదు. త్వరలోనే వీరు బాధ్యతలు స్వీకరించే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యే స్థాయి నాయకులకు రాష్ట్రస్థాయి పదవులను ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకుని చేస్తున్న వారితో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన వారికి ఇప్పటికే చైర్మన్ పోస్టులను కట్టబెట్టాలని యోచిస్తుండంతో సీఎం రేవంత్‌కు, అధిష్ఠానం పెద్దలకు సన్నిహితంగా ఉన్నవారితో కొందరు పైరవీలు ప్రారంభించారు. వీరితో పాటు సీట్లను త్యాగం చేసిన వారిలోనూ ఈ పదవుల ఆశలు రేకెత్తిస్తున్నాయి. కొందరు నేతలు రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పోస్టులు కోరుకోగా ఇంకొందరు జిల్లాస్థాయి పోస్టులపై కన్నేశారు. జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో నామినేటెడ్ పదవులపై సీఎం ఫోకస్ పెట్టినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

వికారాబాద్ జిల్లాలో..

లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో నామినేటెడ్ పోస్టులపై అధికార పార్టీ నేతలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, రాష్ట్ర ఫైనాన్స్ ప్లానింగ్ కమిషన్ సభ్యుడిగా రమేష్ మహరాజ్‌లకు ఇదివరకే పదవులు దక్కాయి. రాష్ట్రస్థాయి పదవులను మరికొందరు నాయకులు ఆశిస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎనుముల తిరుపతిరెడ్డి, నందారం ప్రశాంత్, వికారాబాద్ నియోజకవర్గం నుంచి మునిసిపల్ మాజీ చైర్మన్ వి.సత్యనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, గుడిసె లక్ష్మణ్, ఎర్రవల్లి జాఫర్, మహిపాల్‌రెడ్డి తదితరులు నామినేటెడ్ పదవుల రేసులో ఉన్నారు. తాండూరు నియోజకవర్గం నుంచి మురళీకృష్ణగౌడ్, కరణం పురుషోత్తం రావు, సునీతా సంపత్, ధారాసింగ్, పరిగి నియోజకవర్గం నుంచి లాల్‌కృష్ణ ప్రసాద్, రాములు, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, పరశురాంరెడ్డి, పాలాది శ్రీనివాస్, ఎర్రగడ్డపల్లి కృష్ణ, రామకృష్ణ, హన్మంత్ ముదిరాజ్ పోటీ పడుతున్నారు. ఇదిలా ఉంటే తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాల్‌రెడ్డి, బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాధవరెడ్డి, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంజయ్య పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా నియామక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

అనంతగిరిలో మరోసారి చిరుత కలకలం?



చిరుతకాలి ముద్రలను పరిశీలిస్తున్న ఆర్‌ఎఫ్‌వో అరుణ

» కాలి ముద్రలు పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు

వికారాబాద్, జూన్ 14 : అనంతగిరి అడవుల్లో చిరుత సంచారం మరోసారి కలకలం రేపింది. శుక్రవారం ఉదయం అనంతగిరి హరిత రిసార్ట్ వెనుక వైపు కుక్కలపై చిరుత దాడి చేసిందని రిసార్ట్ మేనేజర్ శ్రీనివాస్‌రాజు సమాచారం అందించడంతో ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఓ వైపు కొడంగల్ నియోజకవర్గం చౌడపూర్ పరిధిలో ఓ వ్యక్తిపై చిరుత దాడి చేసిందని వార్తలు రావడం అదే సమయంలో అనంతగిరిలో చిరుత తిరుగుతుందని సమాచారం అందడంతో అధికారులు వాటి కాలి ముద్రలకోసం అన్వేషణ మొదలు పెట్టారు. ఎక్కడైతే కాలి ముద్రలు ఉన్నాయో వాటిని గుర్తించిన అధికారులు అవి చిరుతవేనా.. కావా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఆర్‌ఎఫ్‌వో అరుణ, ఎస్‌ఎస్‌వో అరుణ, ఫారెస్ట్ సిబ్బంది అడవిలో పర్యటించి కాలి ముద్రలు పరిశీలించారు.

సరిహద్దు అటవీ భూములపై ఆగని లొల్లి



అటవీ భూముల సరిహద్దుల కోసం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇరురాష్ట్రాల అధికారులు

» తెలంగాణ రిజర్వ్ ఫారెస్టులో మళ్లీ కన్నడిగుల భూకబ్జాకు యత్నం
» అడ్డుకున్న తెలంగాణ అటవీ అధికారులు
» ఎనిమిది మంది కన్నడిగులపై కేసులు
» హద్దుల గుర్తింపునకు మరోసారి ఇరురాష్ట్రాల అధికారుల సర్వే

బషీరాబాద్, జూన్ 14: బషీరాబాద్ మండల నీళ్లపల్లి-మైల్వార్ రిజర్వు ఫారెస్టులో కన్నడిగుల అటవీ భూముల కబ్జా పర్వం ఆగడం లేదు. ఇటీవల తెలంగాణ అటవీ ప్రాంతంలో సరిహద్దు ప్రాంత సమీపగ్రామాల్లోని కన్నడిగులు కొందరు చెట్లను నరికి కబ్జాకు యత్నించారు. తెలంగాణ ప్రాంత గిరిజనులు మాకు దక్కని ఆ భూములు, కన్నడిగులు ఎలా సాగు చేసుకుంటారని తెలంగాణ రైతులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వివాదస్పదమైంది. దీంతో తాండూరు డివిజన్ ఫారెస్టు అధికారి శ్యామ్‌సుందర్‌రావు ఆధ్వర్యంలో ఆశాఖ అధికార సిబ్బంది శుక్రవారం రంగంలోకి దిగి అటవీ భూముల కబ్జాను అడ్డుకున్నారు. కబ్జాకు యత్నించిన కర్ణాటక ప్రాంతానికి చెందిన 8 మంది రైతులపై కేసులు నమోదు చేశారు. నీళ్లపల్లి-మైల్వార్ రిజర్వు ఫారెస్టులో 640 ఎకరాల అటవీ భూమి ఉంది. 1991లో 130 ఎకరాలను మన ప్రభుత్వం అప్పట్లో స్వాధీనం చేసుకుని 50 మంది తెలంగాణ రైతులకు పట్టాలిచ్చింది. మిగతా ఈ భూములను కర్ణాటక రైతులు కబ్జా చేసుకుని ఏళ్లుగా పంటలు సాగు చేస్తున్నారు. అంతటితో ఆగకుండా మళ్లీ చెట్లను నరికి భూకబ్జాలకు యత్నిస్తుండటంతో ఏటేటా గొడవలు జరుగుతునే ఉన్నాయి. ఈ భూముల్లో కబ్జాలను అటవీశాఖ అధికారులు ఎప్పటికప్పుడూ అడ్డుకుంటున్నా ఫలితం లేకుండాపోతుంది. రెండు రాష్ట్రాల అటవీ భూమికి సరిహద్దులు నిర్ణయించకపోవడంతో ఈసమస్య కొలిక్కి రావడం లేదు.

ఆగని కబ్జాల పర్వం

సరిహద్దు కర్ణాటక ప్రాంత సమీప గ్రామాల రైతులు మా అటవీ భూమి అంటూ తెలంగాణ అడవుల్లోకి ప్రతియేటా ఎంతో కొంత చొచ్చుకొస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ అటవీ ప్రాంతం సర్వే నంబర్ 20లో ఉన్న 679 ఎకరాల్లో 200 ఎకరాలకు పైగా అటవీ భూమిని కబ్జా చేసి కన్నడిగులు సాగు చేసుకుంటున్నారు. అప్పట్లో రెండు రాష్ట్రాల అధికారులు సరిహద్దులో కొంత మేరకు సర్వే చేసి 50 ఎకరాలను స్వాధీనం చేసుకుని తెలంగాణ ప్రాంత అటవీశాఖ అధికారులు ఇస్మాయిల్‌పూర్ తండా సమీపంలో మొక్కలు నాటి పెంచుతున్నారు. మనరాష్ట్ర అటవీ భూములను కర్ణాటక రైతులు ఆక్రమించకుండా నీలగిరి, కానుగ మొక్కలను నాటారు. కన్నడిగులు రాత్రుల్లో వాటిని నరికి కబ్జాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రాంత అటవీ అధికారులు ప్రతియేటా భూ ఆక్రమణలు అడ్డుకునేయత్నం చేయడం, ఇరు రాష్ట్రాల అటవీ ప్రాంత సమీప గ్రామాల రైతుల మధ్య గొడవలు జరగడం షరా మాములైంది.

అటవీ భూముల కబ్జాపై సీరియస్

తెలంగాణ అటవీ భూముల్లో కర్ణాటక రైతులు కబ్జాకు యత్నించడంపై తాండూరు డివిజన్ ఫారెస్టు రేంజర్ శ్యామ్‌సుందర్‌రావు సీరియస్‌గా స్పందించారు. శుక్రవారం జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ ఆదేశానుసారం నీళ్లపల్లి- మైల్వార్ రిజర్వు ఫారెస్టుకు చేరుకుని ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రాంత గ్రామాల రైతులతో సమావేశమైయ్యారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం తెలంగాణ- కర్ణాటక ప్రాంత రెవెన్యూ, ఫారెస్టు అధికారులు, సర్వేయర్లతో సరిహద్దు అటవీ ప్రాంతమంతా కలియ తిరిగి మ్యాప్‌లను పరిశీలిస్తూ హద్దుల గుర్తింపుకు ఉమ్మడి సర్వే చేశారు. ఈ సర్వేను సర్వే ల్యాండ్ రికార్డు అసిసెంట్ డైరెక్టర్ రాంరెడ్డి నేతృత్వంలో అటవీ ప్రాంత సరిహద్దులను ఇరు రాష్ట్రాల అధికారులందరం కలిసి గుర్తించామని తాండూరు ఫారెస్టు రేంజర్ వెల్లడించారు.హద్దుల సమస్య ఓ కొలిక్కి వచ్చిందన్నారు. ఈ విషయమై ఇరు రాష్ట్రాల జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారిస్తామని ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ అధికారి పీర్యానాయక్, వివిధ మండలాల సెక్షన్, బీట్ అధికారులు పలువురు పాల్గొన్నారు.

కుండపోత..



బొంరాస్‌పేట్ శివారులోని పొలాల్లో చేరిన నీరు

» బండ్లవాగులో వ్యక్తి గల్లంతు
» మేకవనంపల్లి వద్ద వ్యక్తి మృతదేహం లభ్యం



మైతాబ్‌అలీ (ఫైల్)

మోమిన్‌పేట్, జూన్14: వికారాబాద్ జిల్లాలో పలు చోట్ల గురువారం అర్ధరాత్రి వాన దంచికొట్టింది. మోమిన్‌పేట్ మండలంలో భారీ వర్షం కురిసింది. మేకవనంపల్లి నుంచి అమ్రాదికలాన్ గ్రామానికి వెళ్లే దారిలో బైక్‌తో పాటు మైతాబ్‌అలీ వరద నీటిలో కొట్టుకొపోయి మృతి చెందాడు. అమ్రాదికలాన్ గ్రామానికి చెందిన ఎండీ.ఖాజసాబ్ కుమారుడు మైతాబ్‌అలీ (28) అలియాస్ బబ్లూ కాడెద్దుల కొనుగోలు కోసం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ గ్రామంలో సంతకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సదాశివపేట దగ్గర బైక్ రిపేర్ చేసుకొని స్వగ్రామానికి బయలుదేరారు. మేకవనంపల్లి గ్రామ సమీపంలో భారీ వర్షం కురవడంతో కొద్ది సేపు దుకాణాల దగ్గర ఆగి వాన తగ్గగానే తిరిగి బైక్‌పై గ్రామానికి బయలుదేరాడు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో గల బండ్ల వాగు ఉధృతంగా ప్రవహించడంతో అక్కడున్న ప్రజలు, వాహనదారులు వారించినా మైతాబ్‌అలీ వినకుండా వెళ్లగా బైక్‌తో పాటు అతను వరద నీటిలో కొట్టుకుపోయాడు. గమనించిన వాహనదారులు, రైతులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బైక్‌ను గుర్తించారు. అర్ధరాత్రి దాటడంతో ఆచూకి లభించక పోవడంతో ఉదయం7 గంటలకు సీఐ ఆంజనేయులు, ఎస్సై అరవింద్ పోలీసు సిబ్బంది, స్థానికుల సహాయంతో మేకవనంపల్లి గ్రామానికి చెందిన సంగారెడ్డి పొలం దగ్గర ఓ చెట్టుకు తగిలి ఆగిపోవడంతో మృతదేహాన్ని గుర్తించారు. మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు అక్తార్‌పాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఘటనా స్థలంలో సీఐ ఆంజనేయులు, ఎస్సై అరవింద్

బొంరాస్‌పేట్ మండలంలో భారీ వర్షం

బొంరాస్‌పేట్ : బొంరాస్‌పేట్ మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. పరిసర గ్రామాల్లో రాత్రి కురిసిన వర్షంతో సబన్ చెరువు వరద నీటితో నిండటంతో వరి పొలాల్లోకి చేరింది. భారీ వర్షంతో వరద నీరు కాకరవాణి ప్రాజెక్టులోకి చేరడంతో జలకళను సంతరించుకుంది. కురిసిన వర్షంతో వ్యవసాయ పనులకు అనువుగా మారిందని మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు.





వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

తాండూరు రూరల్, జూన్ 14: వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని అల్లాపూర్, బెల్కటూర్, మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామ శివారులోని వాగులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటొద్దని సూచించారు. వర్షాలు కురిసినప్పుడు పొలాల్లో చెట్లకింద ఉండకూడదని సూచించారు. గ్రామాల్లో ప్రజలు శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండరాదన్నారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు పొలాల్లో, చెట్లకింద ఉండరాదని తెలిపారు. అదేవిధంగా వాగుల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను జేసీబీలతో తొలగించాలని ఆయా గ్రామసిబ్బందికి సూచించారు. డీఎస్పీ వెంట కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, బెల్కటూర్ మాజీ సర్పంచ్ వడ్డె మధు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు సందర్శించిన డీఎస్పీ

అనంతరం కర్ణాటక-తెలంగాణ సరిహద్దులోని కొత్లాపూర్ గ్రామశివారులో ఇటీవల ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సందర్శించారు. బక్రీద్ పండుగ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుంచి గోవులను తరలించకుండా చెక్‌పోస్టులో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.


బెల్కటూర్ శివారులో వాగులు పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్ఐ, సిబ్బంది

బక్రీద్ ప్రార్థన వేళలు


మేడ్చల్ టౌన్, జూన్ 14 : బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం నాడు మేడ్చల్‌లో నిర్వహించే ప్రార్థన సమయాన్ని ముస్లిం పెద్దలు శుక్రవారం ప్రకటించారు. మేడ్చల్ పరిధిలోలో మొత్తం ఐదు మసీదుల్లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాత జూమ్మా మసీదులో ఉదయం 8గంటలకు, చెక్‌పోస్టు ఏక్‌మినార్ మసీదులో ఉదయం 8:30గంటలకు, జిందాషామధార్ దర్గా మసీదులో 8:15గంటలకు, అత్వెల్లి ఈద్గాలో ఉదయం 8గంటలకు, మసీదులో ఉదయం 9:30గంటలకు ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

వృథాగా పోతున్న సాగునీరు

● పట్టించుకోని నీటిపారుదల శాఖ అధికారులు


జుంటివాగు చెక్‌డ్యాం నుంచి వృథాగా పోతున్న వర్షం నీరు

తాండూరు రూరల్, జూన్ 14: మండలంలోని గోనూరు శివారులో గల జుంటివాగు చెక్ డ్యాం నుంచి సాగునీరు వృథాగా పారుతోంది. భారీ వర్షాలకు చెక్‌డ్యాంలో వర్షపు నీరు నిల్వ ఉండగా, అట్టి చెక్‌డ్యాం తూము షెటర్ లేకపోవడంతో నీరంతా కిందికి వృథా అవుతున్నది. మరోపక్క చెక్‌డ్యాం గోడ శిథిలావస్థకు చేరి కూలిపోయింది. దీంతో ఆ ప్రాతంలో నీరు నిలిచే అవకాశం లేదని రైతులు అంటున్నారు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. మరోపక్క ఇట్టి నీరు వానాకాలం సాగుకు వాడుకునేందుకు వీల్లేకుండా పోతోందన్నారు.













ప్రాణం తీసిన పందెం

- గడ్డి మందు తాగితే రూ.లక్ష ఇస్తానని బెట్టుకాసిన స్నేహితులు
- అనాలోచితంగా గడ్డి మందు తాగిన మిత్రుడు
- చికిత్స పొందుతూ మృతి.. ఆలస్యంగా వెలుగులోకి..

శంకర్‌పల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సరదాగా కాసిన పందెం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం చందిప్ప గ్రామానికి చెందిన వడ్డె సురేందర్(45) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడికి భార్య అనిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే, అదే గ్రామానికి చెందిన తన ఇద్దరు స్నేహితులు మల్లేషం, మాణిక్యంలతో కలిసి ఈనెల 4న సురేందర్ బయటకు వెళ్లాడు. కాసేపు సరదాగా మాట్లాడుకున్నారు. ఈక్రమంలో సురేందర్‌తో.. నువ్వు పురుగుల మందు తాగితే లక్ష రూపాయలు ఇస్తామని మల్లేషం, మాణిక్యంలు సరదాగా పందెం కాశారు. అయితే, సురేందర్ నిజంగానే పురుగుల మందు తాగాడు. వెంటనే మల్లేషం, మాణిక్యంలు ఉప్పు కలిపిన నీళ్లు కలిపి విరుగుళ్లు చేయించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ సురేందర్ శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సురేష్ మృతికి కారణమైన మల్లేషం, మాణిక్యంపై 306 సెక్షన్‌పై కేసు నమోదు చేశామని శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ తెలిపారు.


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మైనింగ్ పనులను నిలిపివేయాలి : రైతులు

తలకొండపల్లి, జూన్ 14: మండల పరిధిలోని చీపునుంతలలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని గ్రామ రైతులు ఆర్డీవో సూరజ్‌కుమార్‌ను కోరారు. శుక్రవారం కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా తమ పొలాల్లో తవ్వకాలు జరుగుతున్నాయని, ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. మైనింగ్ పనుల మూలంగా పంట పొలాలు, బోరు బావులు, కాలుష్యంతో ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. మైనింగ్ పనులను నిలిపివేయాలని నిర్వాహకులను కోరుతుంటే.. బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. పరమేశ్, భయమ్మ, నిర్మలమ్మ, బాలమ్మ, వీరప్ప, యాదయ్య, ఎల్లమ్మ, ఆశన్న తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

నులిపురుగుల నివారణపై అవగాహన కలిగి ఉండాలి

షాబాద్, జూన్ 14 : ఈ నెల 20న నులిపురుగుల నివారణ దినాన్ని పకడ్బందీగా నిర్వహిద్దామని, ప్రతీ ఒక్కరు నులిపురుగుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ అన్నారు. శుక్రవారం షాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, వైద్యసిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నులిపురుగుల దినం పురస్కరించుకొని.. 12 నెలల పిల్లలకు సగం మాత్రలను, 6 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలు, విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేయాలన్నారు. ఈ మాత్రలు వేసుకుంటే రక్తహీనత, బుద్ధిమాంద్యం వంటి రోగాలబారిన పడరని, రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఎదుగుతారన్నారు. ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో శంకర్‌రాథోడ్, వైద్యాధికారులు వరలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

తలకొండపల్లి, జూన్ 14: ఉపాధ్యాయులు విధిగా సమయ పాలన పాటించాలని ఎంఈవో సర్దార్ నాయక్ కోరారు. విధి నిర్వహణలో అలసత్వానికి తావుండకూడదని అన్నారు. తలకొండపల్లి మండలం మెదక్‌పల్లి, రాంపూర్, జంగారెడ్డిపల్లి, తలకొండపల్లి ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఎంఈవో సందర్శించారు. పాఠశాలల రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తలకొండపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రార్థనా సమయానికి రాని ఉపాధ్యాయురాలు సరోజకు ఒకపూట సెలవు వేయడం జరిగింది. అనంతరం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. సీఆర్పీలు ప్రతీరోజు ఒక పాఠశాలకు వెళ్లి ప్రార్థనకు హాజరుకావాలని సూచించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో సర్దార్‌నాయక్

ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలి

షాద్‌నగర్, జూన్ 14: ఆరోగ్యవంతులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మితో కలసి వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చని, ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అరుణ, స్వర్ణకుమారి, శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, మాధవి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆరోగ్యవంతులు ఎవరైనా రక్తదానం చేయొచ్చు

వికారాబాద్, జూన్ 14 : రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేము కాబట్టి 18 సంవత్సరాల నుండి 55 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ఆరోగ్య వంతులు ఎవరైనా రక్తాన్ని దానం చేయొచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వన్ కుమార్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని, ప్రతీఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసినట్లయితే అనేక ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. వికారాబాద్ జనరల్ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు సిబ్బంది 20మంది రక్తదాతల నుంచి రక్తం సేకరించారు. వారికి డీఎంహెచ్‌వో ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి రవీంద్రయాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్, మైనార్టీ చైర్మన్ సర్ఫరాజ్, నవాజ్, ఎస్సీసెల్ ప్రెసిడెంట్ యాదగిరి, కౌన్సిలర్ మోముల రాజు పాల్గొన్నారు.

అక్రమ సుద్దపై చర్యలేవి!

- సుద్ద నిల్వ పెట్టిన కంపెనీకి నోటీసు ఇవ్వని మైన్‌శాఖ
- దొంగరాయల్టీ సృష్టించి కేసు నీరుగార్చే యత్నం
- సీజ్ చేసిన సుద్ద తమ అధీనంలో వద్దన్న రెవెన్యూ శాఖ
- సేఫ్‌కస్టడీ బాధ్యత ఎవరిది?
- రంగంలో మైన్ డిప్యూటీ డైరెక్టర్


మైన్స్, రెవెన్యూ శాఖలు గుర్తించిన అక్రమ సుద్ద నిల్వలు

తాండూరు, జూన్ 14: పెద్దేముల్ మండలం మారేపల్లి గ్రామ సమీపంలో సుద్ద తవ్వి నిల్వ పెట్టింది అక్రమమేనని మైన్స్ శాఖ నిర్ధారించినప్పటికీ సుద్దకు సంబంధించి నాలుగు రోజులైన ఇప్పటి వరకూ సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయలేదు. చర్యలు చేపట్టలేదు. అక్రమ సుద్ద తవ్వకాలపై 'సుద్దపై గద్దల్లా ' అంటూ ఆంధ్రజ్యోతి కథనంపై అధికారులు స్పందించి రెవెన్యూ, మైన్‌శాఖ సంయుక్తంగా స్పందించి విచారణ జరిపి పంచనామ చేశారు. అక్రమంగా నిల్వ పెట్టిన సుద్ద 5వేల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని మైన్స్ అధికారి నాగరాజు చెప్పారు. అయితే సుద్ద నిల్వలు కోఫియా మైనింగ్ లిమిటెడ్ కంపెనీ ఓనర్ చాకోకు చెందిన సర్వే నెంబర్ 11/అ/1లో నిల్వ పెట్టారు. అయితే ఇది తమకు తెలియకుండా తన స్థలంలో వేశారు అని కంపెనీ ఓనర్ పేర్కొంటున్నప్పటికీ సుద్ద నిల్వ చేసిన వారిపై కంపెనీ ఓనర్ ఫిర్యాదు చేయలేదు. అక్రమ సుద్ద నిల్వలపై సంబంధిత కంపెనీకి మైన్స్ శాఖ నాలుగు రోజులైనా నోటీసు ఇవ్వలేదు. దొంగ రాయల్టీ సృష్టించి నిల్వ చేసిన సుద్దను మాయం చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన మైన్స్ ఏడీ ఒకరు కేసును తారుమారు చేసే యత్నం చేస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. పంచనామ చేసి నిల్వ ఉన్న సుద్దను తమ అధీనంలో పెట్టుకునేందుకు రెవెన్యూ శాఖ నిరాకరించింది. తమ వద్ద సిబ్బంది లేనందున అక్రమ సుద్దను తమ అధీనంలో పెట్టుకోలేమని చేతులెత్తేశారు. కలెక్టర్, ఆర్డీవోకు మైన్స్‌శాఖ ఈ విషయమై వివరించింది. దీంతో పోలీస్ శాఖకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిర్లయం జాప్యం కారణంగా అక్రమ సుద్దను మాయం చేసే అవకాశం కూడా ఉంది. ఇదిలా ఉంటే మైన్స్ ఏడీ సెలవుపై వెళ్లడంతో మైన్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి రంగంలో దిగి సుద్ద కస్టడీపై రెవెన్యూ శాఖకు అప్పగించేందుకు ఆర్డీవో, తహసీల్దార్‌లపై ఒత్తిడి పెంచారు.

ఫిట్‌నెస్ లేని పాఠశాలల బస్సులపై అధికారుల కొరడా

- ఇప్పటి వరకు 41 బస్సులు సీజ్
- పట్టుబడితే సీజ్ చేస్తాం: డీటీవో


స్కూల్ బస్సు తనిఖీ చేస్తున్న అధికారులు

మేడ్చల్ జూన్ 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నూతన విద్యా సంవత్సరం ఈ నెల 12 నుంచి పునఃప్రారంభమైంది. దాదాపు రెండు నెలల పాటు విద్యా సంస్థలు మూసి ఉన్నాయి. విద్యార్థులను తరలించే బస్సులు మూలకే పరిమితమయ్యాయి. వాటి సామర్థ్య పరీక్షల గడువు కూడా మే 15వ తేదీ వరకు ముగిసింది. ఒక వైపు విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమైనా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తికాలేదు. కొందరు యాజమాన్యాలు తమ వాహనాలకు సామర్థ్య పరీక్షలు చేయించడానికి అంతగా ఆసక్తి చూపడం లేదు.

నామమాత్రంగానే తనిఖీలు

ఏటా విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ముందే బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి ఉంటుంది. బీమా, కాలుష్యం తదితర పత్రాలు తప్పనిసరిగా వాహనంలో ఉండాలి. జిల్లా వ్యాప్తంగా 6,076 విద్యాసంస్థల బస్సులు ఉండగా ఇందులో 4941 వాహనాలకు మాత్రమే సామర్థ్య పరీక్షలకు పూర్తి కాగా 1135 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే కొన్ని ప్రయివేటు పాఠశాలలు తరగతులు నిర్వహిస్తుండగా బుధవారం నుంచి మిగిలిన విద్యాసంస్థలు కూడా ప్రారంభమయ్యాయి. బస్సులను పూర్తిగా పరిశీలించకుండా నామమాత్రంగానే తనిఖీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చాలా బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సులు లేకపోవడం, ఇండికేటర్లు పగిలిపోయి ఉండటం కనిపిస్తోంది. అరిగిన టైర్లతో పాటు బస్సుపై పూర్తివివరాలు కనిపించడంలేదు. నిబంధనలు పాటించకుండా కొన్ని పాఠశాలల యాజమాన్యాలు తమ బస్సులు ఇష్టానుసారంగా నడిపిస్తున్నాయి.

41 బస్సులు సీజ్

ప్రాఠశాలలు ప్రారంభమైన నాటి నుంచి శుక్రవారం వరకు అధికారులు 41బస్సులను సీజ్ చేశారు. బుధవారం 15 బస్సులు, గురువారం 5, శుక్రవారం 21బస్సులను ఫిట్‌నెస్ లేకపో వడం, పన్నులు చెల్లించకపోవడం, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా తిరుగుతున్న వాటిపై దాడులు చేసి సీజ్ చేశారు.

పట్టుబడితే సీజ్



విద్యాసంస్థలకు సంబంధించి గడువు తీరిన ప్రతీ బస్సు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిన బాధ్యత ఆయా సంస్థలపై ఉంది. తనిఖీలు ముమ్మరం చేస్తాం. సామర్థ్య పరీక్షలు చేయించని బస్సుల వివరాలు సేకరించి నోటీసులు ఇస్తాం. పట్టుబడితే సీజ్ చేస్తాం.

రఘునందన్‌గౌడ్, డీటీవో, మేడ్చల్ జిల్లా


స్కూల్ బస్సుల ఫిట్నెస్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఫిట్నెస్ లేని బస్సులపై కేసు నమోదు



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 14 : విద్యాసంస్థల బస్సులపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ లేని, పన్నులు చెల్లించని 34 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం నాలుగు బృందాలుగా ఏర్పడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఫిట్‌నెస్ లేని, 15 సంవత్సరాలు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టి పరిస్థితులలో రోడ్లపై తిరగరాదన్నారు. అనుభవం గల 60 ఏళ్లు మించని డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలని సూచించారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని, ప్రతీ విద్యాసంస్థ బస్సు తప్పని సరిగా సంబంధిత రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని తెలిపారు.ఈ తనిఖీల్లో రంగారెడ్డి, మేడ్చల్, ఉప్పల్ రవాణా శాఖ అధికారులు కిరణ్‌రెడ్డి, కృష్ణవేణి, సునీత, నవీన్, ఉపాసన, ప్రతాప్ ఎరాజా, త్రివేణి, శ్రీనివాస్, అనుష తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నీలం చెరువు నాలా దారి మళ్లింపు


నీలం చెరువు నాలా

మేడ్చల్ టౌన్, జూన్ 14: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నీలం చెరువు నాలాను కొందరు ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలు, వాగులు, వంతెనలను సంరక్షించాల్సిన సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తమ భూమి మధ్య ఉన్న చెరువు నాలా దారి మళ్లిస్తున్నారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. చెరువునీరు వ్యవసాయ పొలాలకు చేరదీయడానికి ఏర్పాటు చేసిన కాలువను ప్రస్తుతం పూర్తిగా అన్యాక్రాంతం చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. నీలం చెరువు పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాలు వెంచర్లుగా మారడంతో ఈ ప్రాంతంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు, గేటెడ్ కమ్యూనిటీలు పెద్దఎత్తున వెలిశాయి. దీంతో గేటెడ్ కమ్యూనిటీల మధ్య నుంచి బహుళ అంతస్తుల సమీపం నుంచి కాలువను మళ్లించడానికి రియల్టర్లు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో అనుమతులు లేకుండానే దారి మళ్లింపు పనులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయం పట్ల ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకునే పాపాన పోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దొంగచాటుగా నాలా మళ్లింపు పనులు చేపడుతున్న వారిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని చెరువు ఉనికిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

మిల్లింగ్ రైస్ సకాలంలో డెలివరీ చేయాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జూన్ 14: జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ సకాలంలో ప్రభుత్వానికి డెలివరీ చేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మిల్లర్లకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ప్రభుత్వానికి డెలివరీ చేయాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. రోజూ జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, డీటీసీఎస్‌ల పరిధిలో ఉన్న రైస్‌మిల్లులను పర్యవేక్షించి అందరూ మిల్లర్లు సకాలంలో సీఎంఆర్‌ను డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ మిల్లరు తాను పెట్టాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను తమ తమ మిల్లింగ్ కెపాసిటీ ప్రకారం వెంటనే ఎఫ్‌సీఐ/ సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు డెలివరీ చేయాలని మిల్లర్లకు ఆదేశించారు. ప్రతీ మిల్లరు గడువు తేదీలోగా తమ సీఎంఆర్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్లరు డిఫాల్టర్ రైస్ మిల్లర్లు అందరూ సీఎంఆర్‌ను గడువు తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ రాజేశ్వర్, డీఎంసీఎస్ సుగునాబాయి, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బలీశ్వర్ గుప్త, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- జడ్పీ డిప్యూటీ సీఈవో నీరజ


మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై సర్వే చేస్తున్న ఎంపీడీవో

కీసర, జూన్ 14: మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్ జడ్పీ డిప్యూటీ సీఈవో నీరజా అన్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 10 రోజుల పాటు ఇంటింటి సర్వే చేపట్టారు. సర్వేలో భాగంగా శుక్రవారం జడ్పీ డిప్యూటీ సీఈవో నీరజా మండలంలోని భోగారం గ్రామంలో పర్యటించారు. ఈమేరకు ఆమె క్షేత్రస్థాయిలో మిషన్ భగీరథ అమలు, ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఉందా..?లేదా..? పైప్ లైన్లు ఎలా ఉన్నాయి? ఏ మేరకు నల్లా ద్వారా నీరు ఇళ్లలోకి చేరుతున్నాయి. ప్రజలు ఏమేరకు నీటిని వినియోగించుకుంటున్నారు? అనే విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వినియోగదారుల వివరాలు యాప్ ద్వారా సక్రమంగా నివేదికను ప్రభుత్వానికి అందజేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని ఆమె అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీత పాల్గొన్నారు.


భోగారంలో ఇంటింటి సర్వేలో పాల్గొన్న జడ్పీ డిప్యూటీ సీఈవో నీరజా

దోమ: ఇంటింటికీ తిరిగి మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై నిర్వహిస్తున్న సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో మహేశ్‌బాబు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం మిషన్ భగీరథ కుళాయి కనెక్షన్లను పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వీవోఏలతో కలిసి సర్వే చేయించారు. ప్రతీ గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు భాగ్యలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై సర్వే నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా వస్తుందా, లేదా అని ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ కుళాయి కనెక్షన్లను పరిశీలించి ఫొటోలు తీస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, కులం, ఫోన్, ఆధార్ నెంబర్ సేకరిస్తున్నారు. ఈ సర్వే పదిరోజుల పాటు కొనసాగుతుందని పంచాయతీ కార్యదర్శి నర్సింహులు తెలిపారు.

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

- ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన
- ప్రధాన రహదారులపై ధర్నా, రాస్తారోకో


తలకొండపల్లి : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

ఆమనగల్లు, జూన్ 14: నీట్-2024 పరీక్షలో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించాలని ఎన్‌ఎస్‌యూఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎండీ ఫరీద్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పేపర్ లీకులు, రిగ్గింగుల ద్వారా మోదీ సర్కార్ యువత భవిష్యత్తును నాశనం చేసిందని మండిపడ్డారు. సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించి విద్యార్థులకు న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు మహేశ్, అబ్దుల్, రాహుల్, యూత్ కాంగ్రెస్ నాయకులు కృష్ణ నాయక్, అలీం, నాజర్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించి విద్యార్థులను న్యాయం చేయాలని కోరుతూ ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కడ్తాల మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు షాబోద్దీన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాలశీతలీకరణ కేంద్రం ఎదుట హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపైబైటాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. క్యామ రాజేశ్, భానుకిరణ్, పవన్‌కళ్యాణ్, బోసు రవి, ఇమ్రాన్ బాబా, తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం : ఎన్డీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు

తలకొండపల్లి : నీట్ పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని ఎన్‌ఎస్‌యూఐ, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు రమేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి బీజేపీ, మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఆజీం, నాయకులు తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం : నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధ్యక్షుడు నందకిషోర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం ఇబ్రహీంపట్నంలో నిరసన తెలిపి ఎన్డీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు ఆయాన్, ప్రభాస్, అజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, వెంటనే రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తల్లోజు వినోద్‌చారి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ సంఘం నేతలతో కలిసి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి పార్టీల పొత్తులపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల భవిష్యత్తుపై లేదన్నారు. నాయకులు ప్రభాకర్, రాజ్‌కుమార్, నయీం, ప్రవీణ్ ముదిరాజ్, నాగరాజు, రవి, నవీన్‌ముదిరాజ్, జాహంగీర్, తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు : హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న తల్లోజు వినోద్‌చారి, తదితరులు

సెంచరీ కొట్టిన టమాట



వికారాబాద్, జూన్ 14: వికారాబాద్ మార్కెట్‌లో టమాట సెంచరీ కొట్టింది. మొన్నటి వరకు రూ.40ఉన్న ధర ఒక్కసారిగా రూ.100కు చేరింది. దీంతో సామాన్యులు టమాట కొనాలంటేనే జంకుతున్నారు. సామాన్యుడి వంటలో కచ్చితంగా ఉండేది టమాట. ఆ టమాట ధర పెరుగడంతో కిలో కొనుగోలుచేసే వారు అర కిలో, పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. లోకల్ టమాట మార్కెట్‌లోకి రాక పోవడంతోనే ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు.

విద్యాసంస్థల్లో నడిచే వాహనాల తనిఖీ

● పది వాహనాలపై కేసు



కళాశాల బస్సును తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

మేడ్చల్ టౌన్, జూన్ 14: విద్యార్థులను విద్యాసంస్థలకు తరలించే వాహనాలను ఆర్టీఏ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మేడ్చల్ పరిసర ప్రాంతాల్లోని పాఠశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో నడిచే బస్సుల తనిఖీ కోసం అధికారులు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. మేడ్చల్ ఎంవీఐ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అధికారుల బృందం జాతీయ రహదారిపై విద్యార్థులను తరలిస్తున్న బస్సులను తనిఖీ చేశారు. దాదాపు 10 వాహనాలకు సంబంధించిన దస్తావేజులు సరిగాలేకపోవటంతో వాహనాలపై కేసునమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యాసంస్థల్లో నడిపే వాహనాలను పూర్తిస్థాయిలో నిషేధించటానికి స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులను తరలించే వాహనాల విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని ఎంవీఐ బాబు అన్నారు.

నిరుపయోగంగా బస్టాండ్లు



మేకవనంపల్లిలో బస్టాండ్‌కు అడ్డంగా ఇటుకలు, బారికేడ్లు

మోమిన్‌పేట్, జూన్ 14: ప్రభుత్వాలు ప్రజల సౌకర్యార్థం కోసం ప్రత్యేక కూడళ్ల దగ్గర నీడ కోసం ప్రత్యేకంగా బస్టాండ్‌లను ఏర్పాటు చేశారు. కానీ మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజల అవసరాల కోసం ఇష్టానుసారంగా కాడెద్దులను కట్టేయడం, కట్టెలు నిల్వ ఉంచడం, వ్యవసాయ పనిముట్లు, ఇటుకలు, రాళ్లు పెట్టుకునేందుకు ఉపయోగిస్తున్నారని బాటసారులు, వాహనదారులు వాపోతున్నారు. మేకవనంపల్లి గ్రామంలో బస్టాండ్‌లో అడ్డుగా ఇటుకలను పేర్చి బారికేడ్‌లను అడ్డుగా పెట్టారు. దీంతో ప్రయాణికులు కూర్చునేందుకు వీలు లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి బస్టాండ్‌ను ఆధునీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

దర్గా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



కడా ప్రత్యేకాధికారికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్, జూన్ 14: కొడంగల్ పట్టణ శివారులోని కోస్గి రోడ్డులోగల షేక్ సాహెబ్ పహాడి దర్గా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శుక్రవారం మైనారిటీ నాయకులు ఎస్.ఎం.గౌసన్ ఆధ్వర్యంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రూ.1 కోటి మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ షఫీ అహ్మద్, సయ్యద్ ఇసాక్‌పాష, అబ్దుల్ జబ్బార్, సయ్యద్ ఖైరత్ అలీ ఖాద్రి, అబ్దుల్ ఖయ్యూబ్, ఖాలీద్, ఎండీ.షబ్బీర్ అలీ, కరీం అష్రఫి, ఎండీ.హబీబ్, ఎండీ.హుసేనీ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎం కృష్ణయ్యకు సన్మానం



జీహెచ్‌ఎం కృష్ణయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

యాలాల, జూన్ 14: జీహెచ్‌ఎంగా పదోన్నతి పొంది యాలాల మండలం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన టి.కృష్ణయ్యను ఉపాధ్యాయ బృందం సన్మానించింది. స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుక్రవారంఉపాధ్యాయులు టి.కృష్ణయ్యను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ.జియొద్దిన్, ఎం.విశ్వనాథం, జెస్సీరాణి, టి.బస్వరాజ్, పి.రవి, పి.సువర్ణ, జి.శంకర్, మహమూద్, రవి కుమార్ పాల్గొన్నారు.

గంగా అరుణ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

యాలాల, జూన్ 14: గంగా అరుణ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. మండలంలోని కోకట్ ప్రాంతంలోని టీఎస్‌ఆర్‌జేసీ పాఠశాల, జూనియర్ కళాశాలలో శుక్రవారం గంగ అరుణ ఫౌండేషన్ సభ్యులతో కలిసి వంటశాలను, సామగ్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో సమాన అభివృద్ధి

పరిగి, జూన్ 14: మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని పరిగి మున్సిపల్ ఛైర్మన్ ఎం.అశోక్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. వర్షాకాలం పైపులీకేజీలు బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్‌ఛైర్మన్ ప్రసన్నలక్ష్మి, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు అర్చన, వాసియాతబుసమ్, కిరణ్,రవింద్ర, బి.నాగేశ్వర్,టి.వెంకటేశ్, శభనూను సుల్తాన పాల్గొన్నారు. అనంతరం ప్రతీ వార్డుకు చెత్త సేకరణ బండ్లను ప్రారంభించారు.

బీసీ బాలికల హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి, జూన్ 14: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలిక హాస్టళ్లలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు పరిగి హాస్టల్ వెల్ఫేర్ అధికారి బి.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. పరిగిలోని బీసీ బాలికల హాస్టల్‌లో మూడు నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు తమ కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, నాలుగు ఫొటోలు, గతేడాది మార్కుల జాబితాకార్డు, ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న స్కూల్ నుంచి బోనఫైడ్ తీసుకుని నేరుగా హాస్టల్‌లో కలవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9441186919 నెంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

తాండూరు రూరల్, జూన్ 14: పంచాయతీ కార్మికులు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సీఐటీయూ తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని అనేక హామీలు ఇచ్చి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించకపోతే ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీఐటీయూ నాయకులతో కలిసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్, యూనియన్ మండల నాయకులు శాంతమ్మ, వెంకటమ్మ, నర్సింహులు, దస్తప్ప, అంజిలప్ప, వెంకటప్ప, గుండప్ప, చంద్రప్ప, బసప్ప, లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మూడుచింతలపల్లి, జూన్ 14: హయత్‌నగర్, శివారు ప్రాంతాలలో ధార్ అనే దొంగల ముఠా సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శుక్రవారం శామీర్ పేట్ సీఐ శ్రీనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ దొంగల ముఠా పగటిపూట ఆటోల్లో తిరుగుతూ రెక్కీ చేసి తాళం వేసి ఉన్న ఇళ్లతో పాటు గేటెడ్ కమ్యూనిటీలో నివాసముండే విల్లాలు, అపార్ట్‌మెంట్‌ను ఎంచుకుని రాత్రి పూట మెయిన్‌గేట్ నుంచి రాకుండా కాంపౌండ్ గోడ దూకి మెయిన్ డోర్ కొడుతున్నారని ఇంటి యజమాని డోర్‌తీసిన వెంటనే వారిని కొట్టిచంపి ఇళ్లలో ఉన్న డబ్బు, నగదు ఇతరు వస్తువులను దోచుకెళ్తున్నారని చెప్పారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద ఎవరైనా వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించినా రాత్రి పూట తలిపు తట్టినా తలుపు తీయొద్దని సూచించారు. వెంటనే 100 కు డయల్ చేయాలని చుట్టు పక్కల కాలనీవాసులను అప్రమత్తం చేయాలని సూచించారు.

పాఠశాలల్లో అక్షరాభ్యాసం



కులకచర్ల: చిన్నారులతో అక్షరభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

కులకచర్ల, జూన్ 14: కులకచర్ల మండలంలోని పీరంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో అక్షరాలు దిద్దించి రాయించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్‌ఎం మానస, శశివర్ధన్ తమ సొంత డబ్బులతో పిల్లలకు పలకలు, నోటు బుక్‌లు పంపిణీ చేశారు.

నవాబుపేట: బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నవాబుపేట మండలంలోని ఏక్‌మామిడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చిన్నారులతో పలకలపై అక్షరాలు దిద్దించి వారితో రాయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, శివకుమార్, హెచ్‌ఎం పద్మనాభరావు, ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, స్వరూప, విజయలక్ష్మీ, రుతమ్మ, ఆఫ్రిన్, అన్నపూర్ణ, జయమ్మ, సెక్రోటలర్ అధికారిణి రజిని తదితరులు పాల్గొన్నారు.



దోమ: ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం

దోమ: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పూడూరు: బడిబాటలో భాగంగా మండల పరిధిలోని సోమన్‌గుర్తి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం అంజిలయ్య, ఎంపీటీసీ సిరిదేవిక, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం వెంకటేశం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ స్వప్న పాల్గొని సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థుల చేత సామూహిత అక్షరభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంగీత, అశోక్, నవీన్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ అరుణదేవి, ప్రభావతి, బీఏవో రమాదేవి, ఏఏపీసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తాండూరు మండల వైస్ ఎంపీపీ స్వరూపా వెంకట్‌రాంరెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా కోటబాస్పల్లిలో శుక్రవారం నూతనంగా చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్‌లు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, గ్రామ పెద్దలు వెంకట్‌రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, ఏఏపీసీ పాఠశాల ఛైర్‌పర్సన్ బీరమ్మ, పాఠశాల హెచ్‌ఎంలు జె.శ్రీనివాస్, బోయిని సురేందర్, ఏఏపీసీ సభ్యులు భాగ్యలక్ష్మి, శ్రీలత, రేణుక, ఫాతిమా, ఉమాదేవి, ఉపాధ్యాయులు శోభ, అనురాధ, సుమంగళ, రాధిక, శేఖర్‌రెడ్డి, శ్రీశైలం, మొయిజ్ మహ్మద్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఉమాదేవి, కృష్ణవేణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నవాబుపేట: ఏక్‌మామిడి పాఠశాలలో చిన్నారులతో అక్షరాభ్యాసం

స్థానిక సంస్థల్లో సత్తా చాటుదాం



ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న మేడ్చల్ బీజేపీ నేతలు

మేడ్చల్ టౌన్, జూన్ 14 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదామని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ బీజేపీ నాయకులు శుక్రవారం మండలంలోని మునీరాబాద్ గ్రామ శివార్లలోని ఎంపీ ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. తన విజయం కోసం కష్టపడిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు విజయం సాధించడానికి పట్టుదలతో పనిచేయాలన్నారు. తనను గెలిపించిన మేడ్చల్ బీజేపీ నేతలకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇదే స్ఫూర్తితో బీజేపీ నాయకులు ముందుకు సాగాలని కోరారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ప్రచార ఆయుధాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారెడ్డి నందారెడ్డి, చారి, జాకట ప్రేమ్‌దాస్ పాల్గొన్నారు.

రూ.9లక్షలతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎంపీపీ ఇందిర

కీసర, జూన్ 14: రూ.9లక్షలతో మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ తెలిపారు. స్టేట్ మ్యాచింగ్ గ్రాండ్ కింద కీసర మండలానికి రూ.9లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధుల కేటాయింపుపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇందిర లక్ష్మీనారాయణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌ఛైర్మన్ పూస వెంకటేష్, ఎంపీడీవో గ్యామా, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, ఎంపీటీసీలు నారాయణ శర్మ, జూపల్లి వెంకటేష్, వెంకట్‌రెడ్డి, కిరణ్ జ్యోతి ప్రవీణ్, ప్రమీలా పాల్గొన్నారు.

ప్రపంచ విప్లవ వేగుచుక్క చెగువేరా



తాండూరులో చెగువేరా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తాండూరు, జూన్ 14: తాండూరు పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద చెగువేరా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచంలో ఉన్న పేద, బడుగు, బలహీనవర్గాల కోసం తన జీవితాంతం విప్లవబాటలో నడిచిన మహనీయుడు చెగువేరా అని అన్నారు. నేటి యువతి యువకులు చెగువేరా జీవిత చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు బలరాం, నరేష్, రాజు, విద్యార్థి సంఘం నాయకులు దీపక్ రెడ్డి, వెంకట్, శ్రీనివాస్, నవీన్, కృష్ణ, రవికుమార్, వెంకట్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రేణుకా ఎల్లమ్మ జాతర

తాండూరు రూరల్, జూన్ 14:కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర కొనసాగుతోంది. నెలరోజులపాటు జరిగే ఈజాతరకు తాండూరు ప్రాంతంలోని గ్రామాలతోపాటు కర్ణాటక నుంచి భక్తులు తరలివస్తున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా నాల్గో శుక్రవారం భక్తులు ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చి బోనాలు సమర్పించారు.

సంక్షిప్తంగా..

● **కొడంగల్:** నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆర్ఎస్‌యూ (రెవల్యూషన్ స్టూడెంట్స్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కొడంగల్‌లో విలేకరులతో మాట్లాడారు. 2024 విద్యా సంవత్సరంలో మెడికల్ విద్యను అభ్యసించేందుకు జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షా ఫలితాలు ఈనెల 4న వెలువడగా 67మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు వచ్చి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు రావడం, అందులో ఏడుగురు విద్యార్థులు ఒకే పరీక్షా కేంద్రంలో ఉండటం అనుమానాలకు తావు ఇస్తుందని ఆరోపించారు. సమావేశంలో యూనియన్ నాయకులు సురేశ్‌గౌడ్, చంద్రకిరణ్, భాస్కర్, శివకుమార్, పి.రమేశ్, కృష్ణ యాదవ్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● **ధారూరు:** రాష్ట్ర శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ గత శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. మండలంలోని నాగారం గ్రామంలోని వడ్డెర కాలనీలో బోర్‌వెల్ వేయిస్తానని ఎన్నికల ప్రచారం సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రసాద్‌కుమార్ స్థానికులకు, కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలోని వడ్డెర కాలనీలో బోర్‌వెల్ వేసే కార్యక్రమం ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్‌సీ నిధులతో స్పీకర్ ప్రసాద్ కుమార్ బోర్ వేయించి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకులు అనంతయ్య, యాదయ్య, వెంకట్, వెంకటయ్య, శ్రీనివాస్, అనంతయ్యనర్సింలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

● **మేడ్చల్ టౌన్:** డబీల్‌పూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సమావేశం శుక్రవారం ఎల్లంపేట ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశం గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో స్థానికంగా పార్టీకి లభించిన ఓట్ల గురించి నాయకులు చర్చించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నద్ధం కావాలని సమావేశంలో నాయకులు తీర్మానించారు. పార్టీని బలోపేతంగా తీర్చిదిద్దటానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని, ఇప్పటి నుంచే ప్రజల మధ్యకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని ఈ సందర్భంగా సూచించారు.

● **పరిగి:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పరిగికి చెందిన సీనియర్ విలేకరి బి.రాజు కుటుంబాన్ని శుక్రవారం పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు పరామర్శించారు. జిల్లా కలెక్టర్ సూచన మేరకు వారి కుటుంబ సభ్యులకు రూ.5వేల నగదును అందజేశారు. అలాగే రాజు రేషన్ డీలర్‌గా పని చేస్తుండడంతో ఆతడిస్థానంలో ఆయన భార్యకు రేషన్‌డీలర్‌గా నియమిస్తామని హామీ ఇచ్చారు. రేషన్ డీలర్ల తరఫున రూ.15వేల సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జున్, రేషన్ డీలర్ల సంఘం నాయకులు వార్ల రాకేశ్ ఉన్నారు.

● **కీసర రూరల్:** సకాలంలో పన్నులు చెల్లించి జరిమానా భారానికి గురికావద్దని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులను రెండు విడతలుగా స్వీకరిస్తున్నామన్నారు. మొదటి విడత జూన్ 30లోగా, రెండవ విడత డిసెంబర్ 31లోగా చెల్లించాలని సూచించారు. మొదటి విడత జూన్30లోగా పన్ను చెల్లించని వారికి ప్రతి నెల రెండు శాతం జరిమానా విధిస్తామని తెలిపారు.

● **బొంరాస్‌పేట్:** ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్యాబోధన జరుగుతుందని బొంరాస్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. మండలంలోని ముద్దాయిపేట, సూర్యనాయక్ తండా, గాజులకుంట తండాల్లో ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై ప్రచారం నిర్వహించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్:** రైతుల పొలాల్లో వెళ్లేందుకు ఇబ్బందులు గురిచేయొద్దని తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. చంద్రవంచ గ్రామ శివారులో ఉన్న వివాదాస్పద కాల్వలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ శివారులోని సర్వేనెంబర్-13లో పట్టాదారు వేణు ఇష్టారాజ్యంగా పొలాల మధ్యన నుంచి పెద్దకాల్వలు తవ్వారు. ఇందుకు పక్కసర్వే నెంబర్-12కు సంబంధించిన అసైండ్ రైతులు ఫిర్యాదు చేశారన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో తవ్విన కాల్వలను పరిశీలించామని తెలిపారు. అయితే పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి తవ్విన కాల్వ సర్వేనెంబర్-13లో ఉందా లేదా, సర్వే నెంబర్-12లో ఉందా అనే విషయంపై సమగ్రంగా సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాల్‌రాజ్, రైతులు ఉన్నారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 14: రైలుకింద పడి గుర్తుతెలియని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్-చర్లపల్లి రైల్వేస్టేషన్ల పరిధిలో యంనంపేట్ సమీపంలో శుక్రవారం ఉదయం వరంగల్ వైపు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు (25-30) ఆత్మహత్యకు చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని యువకుడి ఆత్మహత్యకు పాల్పడని తీరును పరిశీలించారు. రైలు ఢీకొట్టడంతో యువకుడి కాళ్లు వేరుగా తెగిపడిపోయాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కల్తీపాలు తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 14: పాలు కల్తీ చేస్తున్న ఓవ్యక్తిని పోచారం ఐటీసీ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ, మక్తా గ్రామానికి చెందిన పాలవ్యాపారి కొత్త సత్తిబాబు(32) అక్రమ సంపాదన కోసం పాలు ఎక్కువగా ఇచ్చేందుకు తన పశువులకు టీకాలు ఇస్తున్నాడు. అంతేకాకుండా పాలను కల్తీ చేయడానికి వాడే షేప్ ఇంజక్షన్లు 200ఎంఎల్‌లు 17సీసాలు, దోల్‌పూర్ ఫ్రెష్‌మిల్క్ ప్యాకెట్‌లు రెండు పాలను కల్తీ చేస్తున్నట్లు సమాచారాన్ని అందుకున్నాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సత్తిబాబును అదుపులోకి తీసుకున్నారు. పశువుల పాకలో పాలు కల్తీకి వాడుతున్న షేప్ ఇంజక్షన్లను, దోల్‌పూర్ మిల్క్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జ్వరం మాత్రలు వికటించి వ్యక్తి మృతి

బొంరాస్‌పేట్, జూన్ 14: మద్యం మత్తులో అధిక మొత్తంలో జ్వరం మాత్రలు వేసుకున్న వ్యక్తి మాత్రలు వికటించడంతో మృతిచెందాడు. ఈ సంఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. మండలంలోని మెట్లకుంట గ్రామానికి చెందిన పల్లెగడ్డ మల్లేశ్(32) జ్వరంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారం మద్యం మత్తులో ఇంట్లో ఉన్న జ్వరం మాత్రలను అధిక మొత్తంలో వేసుకున్నాడు. దీంతో మాత్రలు వికటించి మల్లేశ్ మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి పల్లెగడ్డ యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

మేడ్చల్ టౌన్, జూన్ 14: అడుకుంటున్న బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 11ఏళ్ల బాలిక గురువారం సాయంత్రం పక్కింటి వారి వద్ద ఆడుకుంటుండగా అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న 40 సంవత్సరాల వ్యక్తి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలుపగా వారు గురువారం రాత్రి మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వ్యక్తి పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షమైన మోసానికి పాల్పడిన బంగారం వ్యాపారి




పోలీసుస్టేషన్‌లో బంగారం వ్యాపారి దీపక్ వైష్ణవ్(పసుపు చొక్కాతో నిలబడిన వ్యక్తి)

ధారూరు, జూన్ 14: వినియోగదారులకు రూ.లక్షల్లో కుచ్చుటోపి పెట్టి మాయమైన బంగారం వ్యాపారి శుక్రవారం ధారూరు పోలీసుస్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు. బంగారం వ్యాపారి పోలీసుస్టేషన్‌కు వచ్చాడని తెలుసుకున్న బాధితులు అక్కడికి చేరుకుని తమకు న్యాయం చేయాలని సీఐ, ఎస్ఐలను కోరారు. ఈ సంఘటనపై ఈనెల 11న 'బంగారు దుకాణం యజమాని మాయం' అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. వివరాలిలా ఉన్నాయి. ధారూరులో శ్రీరాం జ్యువెలర్స్ పేరుతో బంగారం, పాన్‌బ్రోకర్ వ్యాపారం నిర్వహిస్తున్న దీపక్ వైష్ణవ్ పది రోజుల కిందట తిరుపతి వెళ్తున్నట్లు చెప్పి ఉడాయించాడు. వారం రోజులుగా బంగారం దుకాణానికి తాళం వేసి ఉండటం, దీపక్ ఫోన్ స్విచ్ఛాఫ రావడంతో బాధితులకు అనుమానం వచ్చింది. బంగారం వ్యాపారి దీపక్ నుంచి రావాల్సిన తాకట్టు బంగారం, నగదు, బంగారం అభరణాల కోసం ఇచ్చి మోసపోయామని గ్రహించిన బాధితులు ఈ నెల10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో దీపక్ కోసం తాండూర్, కోస్గీ, చేవేళ్ల, తదితర ప్రాంతాల్లో ఉన్న దీపక్ బంధువుల వద్ద పోలీసులు వాకబు చేసినా జాడ దొరకలేదు. కాగా శుక్రవారం దీపక్ తన బంధువులతో కలిసి ధారూరు పోలీసుస్టేషన్‌కు వచ్చి పోలీసులకు ఎదుట లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న బాధితులు పోలీసుస్టేషన్‌కు చేరుకుని తమ సొమ్మును దీపక్ నుంచి ఇప్పించాలని సీఐ రామకృష్ణ, ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్‌లను కోరారు. తాకట్టు పెట్టిన బంగారం వెంటనే ఇస్తామని, బంగారం ఆభరణాల కోసం తీసుకున్న నగదు, ఇతర డబ్బులు చెల్లించటానికి సమయం కావాలని దీపక్ కుటుంబీకులు, బంధువులు పోలీసులను అభ్యర్థించి రాతపూర్వకంగా రాసి ఇవ్వడంతో బాధితులు ఊపిరిపీల్చుకున్నారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కులకచర్ల, జూన్ 14: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను కులకచర్ల పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో శుక్రవారంపోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో బొంరెడ్డిపల్లి మార్గంలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ నితిన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తిపై గుర్తుతెలియని అటవీ జంతువు దాడి



గ్రామస్థులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారులు

కులకచర్ల, జూన్ 14: చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పెంటల శేఖర్‌పై గుర్తుతెలియని అటవీ జంతువు దాడిచేసి ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి గ్రామ సమీపంలోకి చెట్ల చాటుకు శేఖర్ బహిర్భూమికి వెళ్లగా గుర్తుతెలియని అటవీ జంతువు దాడిచేసింది. భయాందోళనకు గురైన శేఖర్ సెల్‌ఫోన్ లైట్ వేయగా జంతువు పారిపోయింది. కేకలు వేసుకుంటూ గ్రామంలోకి వచ్చి గ్రామస్థులతో చిరుత దాడి చేసినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. దీంతో వివిధ సామాజిక మాధ్యమాల్లో చిరుత దాడి చేసినట్లు వార్తలు వచ్చాయి. శుక్రవారం పాలమూర్ జిల్లా రేంజ్ అధికారి సయ్యద్ మైబూబ్ హుసేనీ, డిప్యూటీ ఫారెస్టు రేంజ్ అధికారిణి సుమలత, సెక్షన్ అధికారి జక్రీరోద్దీన్, బీట్ అధికారి ఉదహేశ్వర్ గ్రామానికి వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. శేఖర్‌పై చిరుత దాడి చేసినట్లు ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. ఇక్కడ అటవీ ప్రాంతం ఉందని, అటవీ జంతువులు దాడిచేసి ఉండొచ్చని వివరించారు. ప్రజలు భయాందోళన చెందొద్దని, తమ పశువులను ఇంటి వద్దే కట్టివేసుకోవాలని సూచించారు.